క్లుప్తంగా

కొత్త వెలుగులు నిండాలి



కొత్తపేటలో న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నూతన సంవత్సర కానుకగా జగ్గిరెడ్డి స్వయంగా ప్రచురించిన న్యూ ఇయర్ క్యాలెండర్లను శుక్రవారం కొత్తపేటలో ఆవిష్కరించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల దేవతల ఫొటోలతో విడివిడిగా క్యాలెండర్లను ప్రింట్ చేయించారు. వాటిని ఆయా మతాల వారికి పంపిణీ చేశారు. ఈ సంవత్సరం అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని, సుఖ సంతోషాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

సీఎం సహాయ నిధితో ఆసరా



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారిని ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. నగరంలో ఎమ్మెల్యే స్వగృహం వద్ద శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుందన్నారు. ఈ పథకం వర్తించని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని చెప్పారు. పార్టీ నేతలు జక్కంపూడి వాసు, కుసుమ శ్రీనివాస్, పితాని సురేంద్ర, నాగాబత్తుల శ్రీకృష్ణ, బొంతు శేఖర్, దాకే అశోక్, రాయుడు గురుప్రసాద్, ముడకల సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

మలికిపురం: కేశనపల్లి గ్రామానికి చెందిన ఓలేటి సతీష్ కుటుంబానికి కువైట్ అగ్నికుల క్షత్రియ ఎన్నారై సంఘం రూ.1.08 లక్షల ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం ఈ కార్యక్రమం కత్తిమండలో జరిగింది. తాను పని చేసే పీచు ఫ్యాక్టరీలో సతీష్ ప్రమాదానికి గురి కాగా, అతని కుటుంబ పోషణకు ఈ సాయం అందించారు. మాజీ సర్పంచ్ బర్రే శ్రీను, కొల్లు వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ విజయ్, పోతాబత్తుల రమేష్, రేకాడి ప్రసాద్, తారాడి శివ, కొల్లు ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



అంబాజీపేటలో రోడ్డుపై కమ్మేసిన మంచు

అంబాజీపేట: మంచు దుప్పటి కమ్మేస్తోంది.. తెలవారుతున్నా వెలుగు రావడం లేదు. అంబాజీపేటలో శుక్రవారం ఉదయం 9 గంటలు దాటినా సూర్యుడి జాడ కనిపించలేదు. వెలుతురును మంచు దుప్పటి కప్పేసింది. మంచు దట్టంగా ఆవరించడటంతో రోడ్డుపై ప్రయాణించే వారు ఇబ్బంది పడ్డారు. వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది.

నేడు గోదాదేవి కల్యాణం



బాలాజీ సన్నిధిలో కొలువు దీరిన గోదాదేవి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో కొలువు దీరిన ఆండాళ్ తాయార్ (గోదాదేవి) కల్యాణోత్సవం శనివారం ఉదయం పది గంటలకు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భోగి పండగ రోజున అమ్మవారి కల్యాణోత్సవాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తారు. గోదాదేవి కల్యాణ క్రతువుతో నెల రోజుల పాటు అమ్మవారికి నిర్వహించిన ధనుర్మాస దీక్ష సంపూర్ణమవుతుంది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ పర్యవేక్షణలో జరిగే ఈ కల్యాణోత్సవంలో పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొనున్నారు.

అంతర్వేదిలో పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో శుక్రవారం వీరసింహారెడ్డి సినిమా డైలాగ్ రైటర్ సాయిమాధవ్ ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు ఇచ్చారు.

చీకటిని చీల్చే కాంతులొచ్చే..

- భోగికి సర్వం సిద్ధం
- వీధి వీధినా యువత కేరింత

అంబాజీపేట: అంతా కేరింతలు.. భోగి మంటల కాంతులు.. వీధి వీధినా వెలుగులు.. మన సంస్కృతిని చాటే సంక్రాంతి పండగల్లో తొలిదైన భోగిని శనివారం అట్టహాసంగా జరుపుకొనేందుకు అంతా సిద్ధమైంది. తెలవారక ముందే చీకటిని చీల్చే కాంతులు తెచ్చేందుకు వీధి వీధినా కలపతో దుంగలు వేసి రెడీ చేశారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో పండగ వాతావరణం వచ్చింది. ఉదయాన్నే భోగి మంటల్లో పిల్లలు, పెద్దలు భోగి పిడకలు వేసి సందడి చేయనున్నారు. రైతుల వద్ద ఉన్న కొబ్బరి తదితర దుంగలను పోగుచేసి తీసుకొచ్చారు. యువకులు శుక్రవారం రాత్రంతా సందడి చేశారు.

మలికిపురం: లక్కవరంలోని మంగెన గురయ్య కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు జరిగాయి. కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని ఆమె అన్నారు. సరదాగా నిర్వహించిన కోడి పందేలను ఆమె ప్రారంభించారు. అనంతరం రంగవల్లులు, గొబ్బెమ్మలు, కోలాటం, తీన్‌మార్ పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. సర్పంచులు అమ్మాజీ, కోట పుష్పకుమారి, చెల్లుబోయిన హెలీనా, మంగెన సింహాద్రి, అరుణ, గెద్దం రామారావు, ఏబీ నాయుడు, ప్రిన్సిపాల్స్ రాంబాబు, నూకరాజు పాల్గొన్నారు.



అంబాజీపేటలో భోగి మంటకు దుంగలు సిద్ధం చేస్తున్న యువకులు

మామిడికుదురు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పాశర్లపూడిలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఇందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు రూ.200 చొప్పున అందజేశారు. నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నేత వాసంశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలమూరు: చెముడులంక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. తొలుత భోగి మంటలు వేసి సంప్రదాయ రీతిలో ముగ్గులు వేసి గొబ్బెమ్మలతో అలంకరించారు. వివిధ వేషధారణలతో స్థానిక పాఠశాల విద్యార్థులు అలరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు సర్పంచ్ బహుమతులను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీరవెంకట్రావు, దొండపాటి చంటి పాల్గొన్నారు.

అయినవిల్లి: కె.జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. భోగి మంటలు వేసి సందడి చేశారు. సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



లక్కవరంలో సరదా కోడి పందేలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్నకుమారి



పాశర్లపూడిలో ముగ్గుల పోటీల విజేతకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



చెముడులంకలో సంక్రాంతి వేడుకలు

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన తహసీల్దార్ ఠాగూర్, ఎస్సై గంగాభవాని

పి.గన్నవరం: మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, గుండాటలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎస్సై పి.గంగాభవాని హెచ్చరించారు. సంక్రాంతి పండగల సందర్భంగా గతంలో కోడి పందేలు నిర్వహించిన డీఎస్ పాలెం, పి.గన్నవరం, ఊడిమూడి, వాడ్రేవుపల్లి, పోతవరం తదితర ప్రాంతాల్లో శుక్రవారం హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి ఉత్సవాల ముసుగులో అశ్లీల ప్రదర్శనలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ఆలమూరు: స్థానిక సీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కమిటీ సభ్యురాలు చల్లా మునీశ్వరమ్మ ఆధ్వర్యంలో బృందం సభ్యులు వైద్యాధికారి గోపీరామ్ అధ్యక్షతన శుక్రవారం సీహెచ్‌సీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణురాలిని నియమించేలా చర్యలు తీసుకోవాలని, ఈజీసీ యంత్రాన్ని కొనుగోలు చేయాలని తీర్మానించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

పి.గన్నవరం: కె.ముంజవరంలో గత నెల 31వ తేదీ రాత్రి ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.గంగాభవాని తెలిపారు. ఆ రోజు తన తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తరలించేందుకు కారును తీసుకు వస్తుండగా ముగ్గురు అడ్డగించి కొట్టారని ఎం.సుబ్బరాజు ఫిర్యాదు చేశారని ఎస్సై వివరించారు. అతని ఫిర్యాదు మేరకు కె.గోపాలకృష్ణ, ఎం.బాలాజీ, ఎ.నాగేశ్వరరావులపై కేసు నమోదు చేశామని వివరించారు.

నెరవేరిన చిరకాల వాంఛ

- అందుబాటులోకి సీసీ రోడ్డు, డ్రెన్లు
- ప్రారంభించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది.. రోడ్డు, డ్రైన్ అందుబాటులోకి వచ్చింది.. కొత్తపేట కాపు కల్యాణ మండపం నుంచి సత్యాసెంటర్ వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డును సీసీ రోడ్డుగా, దానికి ఇరువైపులా డ్రైన్లు నిర్మించాలన్న స్థానికుల కోరిక నెరవేరింది. రూ.1.40 కోట్లతో నిర్మించిన వీటిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గత ఏడాది డిసెంబర్‌లో రావులపాలెం నుంచి పలివెల వంతెన వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునీకరణ నేపథ్యంలో కొత్తపేట బంగారమ్మ ఆలయ ప్రాంత స్థానికులు సీసీ డ్రైన్లతో కూడిన రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కోరడంతో ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సుమారు 450 మీటర్ల మేర ప్రత్యేకంగా సీసీ రోడ్డు, ఇరువైపులా డ్రైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పట్టుదలతో యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తయ్యింది. నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు జగ్గిరెడ్డి తెలిపారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని స్థానిక రోడ్డు, డ్రైన్ సమస్య పరిష్కారాన్ని చాలెంజ్‌గా తీసుకున్నామన్నారు. ఇదిలా ఉంటే వీటిని ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పేపకాయల బ్రహ్మానందం ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. భారీ ఎత్తున బాణసంచా కాల్పుల నడుమ గజమాల, శాలువాతో సత్కరించి రోడ్డు ప్రారంభానికి తోడ్కొని వచ్చారు. మహిళలు హారతులిచ్చారు. కొత్త రామాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఆధ్వర్యంలో జగ్గిరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మునునూరి వెంకటేశ్వరరావు, సర్పంచులు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కామిశెట్టి అమ్మన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఎంసీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సీసీ రోడ్డు, డ్రైన్లను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

జగ్గిరెడ్డికి సత్కారం

జిల్లా ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీవీడబ్ల్యూఏ) తొలి కార్యవర్గం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా జగ్గిరెడ్డిని కలిశారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా పలివెలకు చెందిన గెద్దం సురేష్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని వారు కలిసి పూల మొక్కను ఇచ్చి, శాలువాతో సత్కరించారు. అలాగే ఎంపీపీ మార్గన గంగాధరరావును, ఇతర ప్రతిపక్ష నాయకులను కలిశారు. ప్రధాన కార్యదర్శి సంగుల దొరబాబు, ఉమ్మడి జిల్లా మాజీ ప్రెసిడెంట్ రామారెడ్డి, కొత్తపేట సంఘ కోశాధికారి తటవర్తి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ

అంబాజీపేట: ధనుర్మాసం సందర్భంగా గంగలకుర్రులో సర్వమంగళ సమేత చెన్నమల్లేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జయంతి భాస్కరసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అర్చకులు పూజ్యం వెంకటశ్రీనివాస్, పెద్దింటి గోపాలాచార్యులు స్వామివారికి లక్షతులసి పూజతో పాటు పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రంగా మిత్రమండలి వితరణ

కొత్తపేట: ఖండ్రిగ గ్రామంలో దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న చిర్రా ప్రకాశరావుకు రాధా- రంగా మిత్రమండలి సభ్యులు నిత్యావసర సరకులు, దుస్తులు అందజేశారు. ఆంధ్ర, తెలంగాణ రాధా- రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపేట మండలానికి వచ్చారు. స్థానిక మిత్రమండలి ట్రస్ట్ సభ్యులు ఆయనను ఖండ్రిగలో బాధిత సూర్యప్రకాశరావు ఇంటికి తీసుకువెళ్లగా అతనిని పరామర్శించి, సాయం అందజేశారు. ఏపీ అధ్యక్షుడు గండ్రోతు పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మేడిద సతీష్, మండల యూత్ అధ్యక్షుడు కోటిపల్లి దామోదర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

అయినవిల్లి: నేదునూరులో ఎఫ్ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎఫ్ఎంసీ కంపెనీ ప్రతినిధులు ఆర్.రమేష్, ఎ.శ్రీమన్నారాయణ, తోటకూర సాయి పాల్గొన్నారు.

అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

మామిడికుదురు: పెదపట్నంలంకలో అగ్రికల్చర్ మిషన్ ఆపరేటర్ ప్రోగ్రామ్‌లో భాగంగా 35 రోజుల పాటు శిక్షణ పొందిన వారికి శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో సర్టిఫికెట్లు అందించారు. నాబార్డు మరియు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తర్ఫీదు పొందిన అభ్యర్థులకు నాబార్డు ఏజీఎం స్వామినాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డీఎస్‌డీఓ లోకమాన్ చేతుల మీదుగా వీటిని అందించారు. క్వాయర్ ఇండస్ట్రీ చైర్మన్ వేగి వెంకటేశ్వరరావు, ట్రైనర్ గాలి లక్ష్మీదుర్గ, దివి మంగరాజు, మొల్లేటి తెలుపులరాజా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

సఖినేటిపల్లి: మోరిలో శుక్రవారం స్థానిక వెన్నెల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 120 మంది చేనేత కార్మికులకు నిత్యావసర సరకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ మేరకు వీరు కార్మికుల ఇళ్లకు వెళ్లి కిట్‌లను అందజేశారు. 2018 నుంచి తమ సంస్థ ద్వారా సంక్రాంతి పర్వదినాన సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వేసవిలో కూడా చలివేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. బూశిం చినబాబూరావు, పడవల వీరవెంకట సత్యనారాయణ, బళ్ల సురేష్‌కుమార్, బొమ్మిడి జయరామ్, బెల్లంకొండ కొండయ్య, బిళ్ల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధిద్దాం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీ శంకర్ వివరించారు. డ్రై డే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలు ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది చైతన్య ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరు ఆత్రేయపురం శ్రీమంతులు

దేవాలయాల నిర్మాణానికి పాతపాటి సోదరుల సహకారం

ఆత్రేయపురం: సొంత ఊరును ప్రేమించే శ్రీమంతులు పాతపాటి సోదరులు. స్వగ్రామం ఆత్రేయపురంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంతో పాటు ఇతర పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి రూ.లక్షల విరాళాలు అందించి ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ ఊరుపై మమకారం చాటుకుంటున్నారు పాతపాటి నాగరాజు, రామాంజనేయరాజు, వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు). సొంత ఊరికి ఎంతో కొంత మేలు చేయాలనే తపనతో గ్రామంలో జరిగే సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. హైదరాబాద్‌లో వ్యాపార రీత్యా స్థిరపడ్డారు. ఆత్రేయపురం ప్రధాన రహదారి చెంతన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని శ్రీవెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ద్వారా సుమారు రూ.2.50 కోట్లతో పాతపాటి సోదరులు నిర్మించారు. గ్రామస్తుల విరాళాలు లేకుండా పూర్తి స్థాయిలో ఆలయం నిర్మించిన ఘనత దక్కించుకున్నారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. గ్రామంలో శ్రీకనక మహాలక్ష్మి, శ్రీమల్లమ్మ, శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర, రాధాకృష్ణుల ఆలయాలతో పాటు పెద్ద రామాలయానికి కూడా రూ.లక్షల్లో విరాళాలు అందించారు. తమ ఫౌండేషన్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. పేదలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. అవసరాన్ని బట్టి ఆర్థిక సాయం చేస్తున్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్డి లేని వారు మరుగుదొడ్డి నిర్మించుకుంటే ప్రభుత్వ నిధులతో పాటు ఈ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ.2 వేల సహాయం అందించారు. ఆత్రేయపురాన్ని బహిరంగ మల విసర్జన రహితంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తున్నారు. పేద వృద్ధులు, విద్యార్థులను ఆదుకోవడంలో ముందు ఉంటున్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో గ్రామంలో క్షత్రియ సామాజిక వర్గానికి విందు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.





పాతపాటి సోదరులు

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో..



మొగలికుదురులో..



పొన్నమండలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్నేహబంధం ఎంతో మధురం.. చిననాటి జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలం.. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సాగింది. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 1990-91లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం అదే స్కూల్ తిరిగి కలుసుకున్నారు. ఆనాటి మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సరదాగా గడిపారు. నాటి చిలిపి అల్లర్లు గుర్తు చేసుకొంటూ విద్యార్థుల్లా మారిపోయారు. మహిళలైతే పిల్లా పాపలతో సతీసమేతంగా హాజరై గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు.

మామిడికుదురు: మొగలికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1983-84వ సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అదే పాఠశాల ప్రాంగణంలో జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి నాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు తెచ్చుకున్నారు. గురువులు కె.హనుమంతరావు, పి.వెంకటరామరాజులకు శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు.

రాజోలు: పొన్నమండలోని శ్రీరామకృష్ణా జిల్లా ఉన్నత పాఠశాలలో 1983-84లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఆనాడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. సమ్మేళనం ఏర్పాటు చేసిన సాగి నరసింహరాజు, పైడిపర్తి రత్నాజీ, బత్తుల హేమప్రసాద్, ఎడ్విన్ మైఖేల్, భాగవతుల వెంకట రామకృష్ణ, గంటి ఉదయ భాస్కరరావులను స్నేహితులు అభినందించారు.

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం అదే పాఠశాల ఆవరణలో జరిగింది. 1997 పదో తరగతి విద్యార్థులు కలుసుకుని నాటి అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సత్కరించారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- రూ.22.96 లక్షల వడ్డీ రాయితీ
- మూడు నియోజకవర్గాల్లో 9,988 మందికి మేలు

మామిడికుదురు: చిరు వ్యాపారులకు సీఎం జగన్ సర్కారు అండగా నిలుస్తోంది. 'జగనన్న తోడు' పథకంలో రుణాలు పొందిన లబ్ధిదారులకు ఆరో విడత వడ్డీ రాయితీ నిధులు విడుదల చేసింది. ఈ పథకం ద్వారా అర్హులైన చిరు వ్యాపారులకు ప్రభుత్వం ప్రతి ఏటా రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణం అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఇచ్చిన రుణాలకు సంబంధించిన వడ్డీ రాయితీ సొమ్మును రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. పాదయాత్రలో చిరు వ్యాపారుల కష్టాలు చూసి చలించిన జగన్ వారికి వడ్డీ లేని రుణాలు అందించి వారిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా జగనన్న తోడు పథకం ప్రవేశపెట్టి ఇచ్చిన రుణాలకు సంబంధించి వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేస్తోంది.

మూడు నియోజకవర్గాల్లో ఇలా..

'జగనన్న తోడు' పథకం ద్వారా మూడు నియోజకవర్గాల్లో 9,988 మంది రుణాలు పొందారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 3,746 మంది, రాజోలు నియోజకవర్గంలో 3,464, కొత్తపేట నియోజకవర్గంలో 2,778 మంది లబ్ధి పొందారు. ఈ పథకం ద్వారా తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీ రాయితీ రూ.22.96 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ రాయితీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ అయ్యింది.



ఇటీవల కలెక్టరేట్‌లో జగనన్న తోడు వడ్డీ రాయితీ చెక్కు అందించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే చిట్టిబాబు

సాయం అందింది..



'జగనన్న తోడు' పథకం ద్వారా నేను ప్రభుత్వ సహాయం పొందాను. ఏడాదికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం సహాయం అందింది. ఆ రుణంతో పెరటికోళ్ల పెంపకం చేపట్టాను. ఈ రుణం పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడింది. దీనికి సంబంధించిన వడ్డీ రాయితీ నా బ్యాంకు ఖాతాకు జమైంది.

–సీహెచ్ మోహినీదుర్గ, మామిడికుదురు

ఆనందంగా ఉంది



నేను హోటల్ నిర్వహణ ద్వారా కుటుంబ పోషణలో నా భర్తకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాను. నేను జగనన్న తోడు పథకంలో రుణం పొందాను. బ్యాంకు ద్వారా ప్రభుత్వం ఇచ్చిన రుణం మా వ్యాపారాభివృద్ధికి ఎంతో ఉపయోగపడింది. నేను తీసుకున్న రుణానికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కూడా విడుదల చేయడం ఆనందంగా ఉంది.

–చిలపూడి దుర్గ, గోగన్నమఠం

మాకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో వ్యాపారులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. సీఎం పదవిని చేపట్టిన వెంటనే జగనన్న తోడు పథకం ద్వారా మాకు మేలు చేశారు. నా లాంటి ఎంతో మంది చిన్న వ్యాపారులు ఈ పథకం ద్వారా వ్యాపారాన్ని రెట్టింపు చేసుకున్నారు. మాకు వడ్డీ భారం లేకుండా రుణాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

–కె.సత్యవతి, కరవాక